17వ వసంతంలోకి..
నేటి దినపత్రిక
సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 30 జులై 2024 పేజీలు 8




# ఉన్నత లక్ష్యాలను ఏర్పరచాలి

**శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ కె.మహాలక్ష్మి**





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచాలని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ కె.మహాలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పిల్లలను వారే ఉన్నత లక్ష్యాలను వారే ఏర్పరచుకునేలా ప్రోత్సహించాలన్నారు. స్కూల్ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను టాపర్స్ నిలిపేందుకు, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రతీ వారం ఓబీటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, గత వారం నిర్వహించిన పరీక్షల్లో మొదటి స్థానంలో శిరీషా, సుహానా, రెండవ స్థానంలో నక్కా అక్షయ్, వీరితో పాటుగా పలువురు విద్యార్థులు టాపర్‌లుగా నిలిచారన్నారు.

ఈ పరీక్షలు విద్యార్థులలోని ప్రతిభను మెరుగుపరిచేందుకే కాకుండా, రాబోయే పై చదువులకు కూడా బెస్ట్ గైడెన్స్‌గా ఉంటాయని ప్రిన్సిపాల్ మహాలక్ష్మి అన్నారు. టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఓబీటీ టాపర్స్ సర్టిఫికేట్‌లను అందజేసి అభినందించారు.

# లైంగిక నేరాలను అరికట్టడం.. ప్రతి ఒక్కరి బాధ్యత

**లైంగిక వేధింపులను ఆరికట్టి బాలికలకు బంగారు భవిష్యత్తునిద్దాం..**

**ఫోక్సో చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయండి : జిల్లా కలెక్టర్ డా.జి. సృజన**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** లైంగిక వేధింపుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి లైంగిక వేధింపులను ఆరికట్టడం ప్రతి ఒక్కరి భాధ్యతని



లైంగిక వేధింపులకు పాల్పడేవారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడవద్దని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. లైంగిక వేధింపుల నివారణపై జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "అరవండి" "పరిగెత్తండి" "చెప్పండి నినాద్దంతో రూపొందించిన గోడ పత్రికలను సోమవారం జిల్లా కలెక్టర్ డా.జి. సృజన కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల రక్షణకు కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న హక్కులు చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికల రక్షణకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నప్పటికి అక్కడక్కడ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకోవడం బాధకరం అన్నారు. లైంగిక నేరాల నుండి బాలిక రక్షణ కొరకు ఏర్పాటు చేసిన ఫోక్సో చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. లైంగిక వేధింపులు అశ్లీల చిత్రాల నేరాలబారిన మిగతా 2లో

# రైతులు కోసమే రైతు బజార్..

**పండించిన కూరగాయలను వారే స్వయంగా అమ్ముకునే విధంగా అదనంగా మరొక రైతు బజార్**

**ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య**



జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ : పట్టణంలోని చెరువు బజార్లో ఏర్పాటుచేసిన రెండవ రైతు బజార్‌ను మిగతా 2లో...

# సమస్యల సత్వర పరిష్కారానికి మీకోసం





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి మీకోసం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ముఖ్య 2లో



# గన్నవరం నుంచి దేశంలోని పలుచోట్లకు విమానాలు

**కేశినేని చిన్ని వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

వివరాలు 2లో..

# అర్జీల పరిష్కారంలో నిర్ధిష్టమైన స్పష్టత ఉండాలి

**పారదర్శకత జవాబు దారితనం తో అర్జీలను పరిష్కరించండి..**

**జిల్లా కలెక్టర్ డా. జి.సృజన**



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్ధిష్టమైన స్పష్టతతో అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అధికారులను అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సృజన, డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటే



శ్వర్లు, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీ కుమారి తదితరులతో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధిష్టమైన స్పష్టతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత మేరకు అధికారుల పరిధిలో ఉన్న అధికారాలను వినియోగించి నిర్దేశ గడువులోగా పరిష్కారం చూపగలిగితే అర్జీదారుడు సంతృప్తి చెందడంతో పాటు ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందనే విషయాన్ని ప్రతి ఒక్క అధికారి దృష్టిలో ఉంచుకోవాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. అధికారులు అనుమతుల కోసం సమర్పించే ధస్త్రాలు (ఫైల్స్) స్పష్టత ఉండాలన్నారు..దస్త్రాం రూపొందించే విషయంలో చెప్పవలసిన విషయాన్ని అర్థమయే రీతిలో రూపొందించి సమర్పించాలన్నారు. దస్త్రాలను రూపొందించడంలో పారదర్శకత జవాబుదా రితనం పై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రింది స్థాయి ఉద్యోగులు రూపొందించిన దస్త్రాలను పరిశీలించి ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని ప్రభుత్వ మార్గదర్శకాలు నిబంధనలను పాటిస్తూ అనుమతుల కొరకు ప్రతిపాదిస్తే జాప్యానికి తావుపుండదన్నారు. సమీక్ష సమావేశాలకు పూర్తి స్థాయి సమాచారంతో నోట్ ఫైల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సిద్ధం చేసుకుని హాజరు కావాలని జిల్లా కలెక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 111 అర్జీలు అందగా..**

వీటిలో రెవెన్యూ- 40, పోలీస్- 18, పంచాయతీరాజ్- 9, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి- 6, డీఆర్‌డీఏ- 5, కోపరేటివ్ -4, సాంఘిక సంక్షేమం- 4, సర్వే అండ్ సెటిల్‌మెంట్-3, ఏపీసీపీడీసీఎల్- 2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం-2, విద్య-2, పరిశ్రమలు -2, అగ్రీ ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ -1, ఎపిఎస్ఆర్టిసి-1, పౌర సరఫరాలు-1, దేవాదాయ 1, అటవీ శాఖ-1, గ్రామ వార్డు సచివాలయం-1, వైద్య ఆరోగ్య శాఖ -1, హౌసింగ్ -1, ఐసిడిఎస్ -1, మైన్స్ అండ్ జియాలజీ -1,మైనార్టీ వెల్ఫేర్ -1, నేషనల్ హైవే -1, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్- 1, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ -1, అర్జీలు స్వీకరించారు.

## జాతీయ ఖో ఖోలో మెరిసిన గన్నవరం హై స్కూల్ విద్యార్థి



**గన్నవరం, జూలై 29, మేజర్ న్యూస్ :** ఈ నెల 22 నుండి తమిళనాడు రాష్ట్రంలో శ్రీ సుబ్రహ్మణ్యం నాదర్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి హెచ్. సి. యల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఖో ఖో పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల 9 వతరగతి విద్యార్థి గంటేటి నాగ బాలాజి కి రజత పతకం సాధించినట్లు పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయురాలు కృష్ణ కుమారి సోమవారం పత్రికలకు తెలిపారు. ఇటీవలి నాగార్జునా యూనివర్సిటీ లో జరిగిన సౌత్ జోన్ ఖో ఖో పోటీలకు హాజరై ప్రతిభ కనబరచిన బాలాజి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. జాతీయ ఖో ఖో పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు రజత పతకం సాధించడానికి బాలాజి కృషి చేసినట్లు కృష్ణ కుమారి తెలిపారు. బాలాజి రజత పతకం కైవసం చేసుకున్న సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కృష్ణ కుమారి, ఉమా దేవి, బాలాజి ని అలాగే బాలాజి ని ప్రోత్సహించిన పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ వసతి గృహ అధికారి ప్రకాష్, తరగతి ఉపాధ్యాయులు మోషే తదితరులు పాల్గొన్నారు.

## సీతమ్మ అమ్మవారికి శాకంబరీ అలంకరణ



**నందిగామ, జులై 29, మేజర్ న్యూస్:** శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానంలో సీతమ్మవారికి శాఖంబరి అలంకరణ నందిగామ శ్రీ సీతా రామాంజనేయ కూరగాయల వర్తక సంఘం., భక్తుల సహాయ సహకారాలతో అలంకారం చేశారు. గత 15 సంవత్సరాలుగా ఈ రామాలయంలో ఈ శాఖంబరి అలంకారాలు చేస్తున్నామని. రేపు ఉదయం ఈ అలంకారం చేసిన కూరగాయలతో కదంబ ప్రసాదం తయారుచేసి భక్తులకు ఇస్తామని అర్చకులు దీవి శశి కృష్ణమాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి తొర్లికొండ సీతారామయ్య, దేవాలయ సిబ్బంది, ఇన్స్పెక్టర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆషాడమాస సారె

**గన్నవరం, జూలై 29, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం, గారపాడు, వెన్నుతల గ్రామాల నుండి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ మాస సారె ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 220 మంది భక్తులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం కృష్ణాజిల్లా సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 రోజులలో 25 మండలాల్లో 468 గ్రామాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని అనగా ఇంద్రకీలాద్రి ఇలా ఇతర గ్రామాలలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. ఉంగుటూరు మండల సహ కన్వీనర్ పడమట అర్జునరావు తెలియజేశారు. మహిళా కమిటీల సహకారంతో భక్తులందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో జై దుర్గా నామస్మరణతో, గారపాడు, వెన్నుతల గ్రామంనుండి గంగానమ్మ అమ్మవారి వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ తేలు.సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాతూరు బాబుజి, గుప్తాపూర్ణచంద్రరావు, మహిళా కమిటీలు, గ్రామ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఓలకు 3 సంవత్సరాలు గౌరవ వేతనం విడుదల



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గత మూడు సంవత్సరాలుగా బి.ఎల్.ఓలకు గౌరవ వేతనాలు విడుదల చేయడం లేదని, 2021 లో 6 నెలలకు గానూ ఇటీవల సెనెక్స్ చేసిన వేతనాలను కూడా ఇక్కడ అధికారులు పక్కదారి పట్టించారని, అవనిగడ్డ నియోజకవర్గ బి.ఎల్.ఓ లు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో కలెక్టర్ డి.కె బాలాజీ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివరించారు. కార్యాలయ పనులు ఎన్ని ఉన్నప్పటికి వేరేచోట డ్యూటీ వేసినప్పటికి సొంత ఖర్చులు భరించి డ్యూటీ నిర్వహించామని, కనీసం జీతం అడుగుతుంటే రెవెన్యూ కార్యాలయ సిబ్బంది సమాధానం కూడా చెప్పడం లేదని కలెక్టర్‌కు తెలియచేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ అవసరం అయితే ఎన్నికల ప్రధాన అధికారితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శిల రాష్ట్ర అధ్యక్షులు ఆది అశోక్, కడవకొల్లు నవీన్, తోట జాహ్నవి, నాగార్జున, మహేష్‌తో పాటు పలువురు బి.ఎల్.ఓలు పాల్గొన్నారు.






## మిలిటరీ గ్రేడ్ డ్యూరబిలిటీతో ఒప్పో కె12ఎక్స్ 5జీ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఒప్పో ఇండియా తన ఉత్పత్తుల శ్రేణిలో అత్యంత కఠినమైన 5జీ స్మార్ట్‌ఫోన్ కె12ఎక్స్ 5జీని కేవలం రూ.12,999 లకు పరిచయం చేస్తోంది. ఈ పరికరం బ్రీజ్ బ్లూ, మిడ్‌నైట్ వైలెట్ అనే రెండు ఆకర్షణీయమైన రంగుల్లో, ఒప్పో ఇ-స్టోర్, ఫ్లిప్‌కార్ట్ లో వచ్చే ఆగస్టు 2వ తేదీ నుంచి అందుబాటులో ఉంటుంది. ఇది 'ఎంఐఎల్-ఎస్‌టిడి-810 హెచ్' మిలిటరీ గ్రేడ్ సర్టిఫికేషన్, దుమ్ము, నీటి నిరోధకత కోసం ఐపీ54 రేటింగ్‌ను, సెగ్మెంట్ ఫస్ట్ స్ప్లాష్ టచ్ టెక్నాలజీతో సెగ్మెంట్ లీడింగ్ మన్నికను కలిగి ఉంటుంది. కనుక, వినియోగదారులు తడి వేళ్లతోనూ టచ్‌స్క్రీన్ ను ఆపరేట్ చేయవచ్చు.

## కేంద్ర బడ్జెట్‌పై ఎన్ఎస్ఈ ఎండీ అండ్ సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ స్పందన

**విజయవాడ, మేజర్ న్యూస్ :** మోదీ 3.0 ప్రభుత్వంలో 2024 కేంద్ర బడ్జెట్‌పై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎండీ అండ్ సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ తన స్పందన తెలియజేశారు. "2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన బడ్జెట్, ప్రభుత్వ రంగంతో పాటు ఉద్యోగాల కల్పనలో ప్రైవేట్ రంగం కూడా పాలుపంచుకునేలా చేయడం ద్వారా భారతదేశంలో ఉద్యోగాల కల్పనకు భారీ పూనీకత్తును అందించారు. అదే సమయంలో భారతదేశం నంబర్ వన్ స్టార్టప్ నేషన్‌గా, పారిశ్రామికవేత్తల దేశంగా అవతరించేలా ఏంజెల్ ట్యాక్స్ పై మినహాయింపు.. అలాగే ముద్ర లోన్ స్కీమ్ పరిమితిని ఒక్కో వ్యక్తికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం ద్వారా భరోసా ఇచ్చారు. వర్క్‌ఫోర్స్‌లో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు, భారతదేశం మరింత జనాభా డివిడెండ్‌ను పొందడంలో సహాయపడేందుకు భారతదేశ కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంపై కూడా ఆమె దృష్టి సారించారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా నైపుణ్యాభివృద్ధి చేయాలనే ఆమె ఆలోచన స్వాగతించతగినది, అయితే మౌలిక వసతుల వ్యయాన్ని చెక్కుచెదరకుండా ఉంచడం, ద్రవ్య లోటును 5.1 శాతం అంచనా నుండి 4.9 శాత వద్ద తగ్గించడం వినూత్నమైన ఆలోచన. 2025-26లో 4.5 శాతం ఆర్థిక లోటుకు గ్లైడ్ పాత్ ఇవ్వడం ద్వారా భారతదేశం యొక్క దీర్ఘకాలిక క్రెడిట్ రేటింగ్ మెరుగుపడుతుందని నిర్ధారిస్తూ ప్రత్యక్ష లేదా పరోక్ష పన్నుల నిర్మాణంతో పెద్దగా సంబంధం లేకుండా, ఈ విషయాలన్నీ సాధించబడనున్నాయి" అని ఆశిష్‌కుమార్ చౌహాన్ పేర్కొన్నారు.

## బాల శివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బాలశివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణచిరువోల్లంక మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణా నదీ నడుమ వెలసిన బాలశివశంకర భగవాన్‌కు క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం నవమి తిధిని పురస్కరించుకుని సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వామి వారికి నవవిధ అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ముందుగా స్వామి వారిని కృష్ణానదీజలాలతో అభిషేకించారు. ఆలయ అర్చకులు కాశీభట్ల సుబ్బయ్య శాస్త్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు గోత్రనామాలతో పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా దివిసీమ నుండే కాకుండా జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ ఆవరణలో గల గణపతి కుమారస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించి నాగేంద్రస్వామి వారి పుట్ట లో పాలు పోసి పూలు, పండ్లతో పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు.

## అవనిగడ్డలో 3.8 మి.మీ వర్షపాతం నమోదు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సోమవారం వేకువ జామున అవనిగడ్డలో 3.8 మి.మీ ల వర్షపాతం నమోదు అయ్యింది. గత 5 సంవత్సరాల్లో రోడ్లు అభివృద్ధి లేక చిన్న చిన్న గుంటలను మట్టి, బుసకలతో నింపక కురిసిన కొద్ది పాటి వర్షానికి ఈ రహదారులపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవనిగడ్డ బస్ స్టాండ్ నుండి బందలాయిచెరువు వరకు నిర్మించిన బైపాస్ రహదారి ప్రజలకు ఈ వర్షంతో ప్రాణసంఘటంగా మారింది.

## టైక్వాండోలో సత్తా చాటిన మచిలీపట్నం బాలిక



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఈనెల 28వ తేదీన విజయవాడ లయోలా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ 14 (38 కేజీల లోపు) బాలికల విభాగంలో జిల్లా స్థాయి టైక్వాండో పోటీలలో మచిలీపట్నం జనశక్తి నగర్ కు చెందిన విశ్వనాథపల్లి శ్రావణి బంగారు పతకం సాధించి సత్తా చాటారని రాష్ట్రస్థాయి చీఫ్ కోచ్ ఈశ్వర్ ఆశీస్సులతో మచిలీపట్నం లో స్థాపించబడిన శ్రీ వెంకటేశ్వర టైక్వాండో అకాడమీ కోచ్ అరవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక లేడీ యాంప్తిల్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విశ్వనాథపల్లి శ్రావణి ఆగస్టు రెండో తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొననున్నారు. మచిలీపట్నంకు చెందిన ఈ బాలిక టైక్వాండలో విశేష ప్రతిభ చూపడంతో బాలిక తండ్రి విశ్వనాథపల్లి శరత్, లేడీ యాంప్తిల్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారం చేయాలనే దృక్పథంతో మీకోసం




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రజలు ఎదుర్కొనే సమస్యను చట్ట పరంగా పరిష్కరించి, న్యాయం అందించడానికి కృష్ణాజిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం – ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జిల్లా నలుమూలల నుండి ప్రజలు మీకోసం కార్యక్రమంలో వారి సమస్యలను గూర్చి ఫిర్యాదు చేయగా వారి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. సమస్యలు చట్టపరిధిలో విచారణ జరిపి, నిర్ణీత సమయంలోపల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఫోన్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అంతేకాక ప్రజలకు ప్రతి సోమవారం అందుబాటులో ఉండి వారి సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కారం అందించే దిశగా కృషి చేస్తామని భరోసా కల్పించారు.

## స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా నమోదు చేయాలి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టంను పటిష్టంగా అమలు చేయుట జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జి గీతాబాయి అన్నారు. మచిలీపట్నం లోని ఉత్తమ స్కాన్ సెంటర్, సాయి శ్రీరామ్ హాస్పిటల్‌లోని స్కానింగ్ కేంద్రమును మోడిఫికేషన్ నిమిత్తము సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా పిసిపిఎన్డిటి చట్టం పరిధిలో నమోదు చేయవలసినదిగా తెలియజేసారు. ఎవరైనా లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపును కూడా రద్దు చేయడం జరుగుతుందని, ముఖ్యంగా జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి గల ప్రాంతాలను గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రజలలో అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులన్నీ కచ్చితంగా ఉండాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు బి. రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

# చుక్కల సమస్య తీరేది ఎప్పుడు ?



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమలో 2017లో అప్పటి ప్రభుత్వం కొన్ని స్థలాలను 22ఎ (నిషేదిత భూములు) జాబితాలో చేర్చింది. వీటికి సంబంధించిన పంట పొలాలు, చెరువులు, ఇళ్ళ స్థలాలు క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు అవ్వకపోవడంతో పంట పొలాలు, చెరువులకు రుణాలు, హౌసింగ్ లోన్‌లకు ఆటంకం ఏర్పడటంతో ఆ నిషేదిత భూములకు సంబంధించిన పిల్లల పెళ్ళిళ్లకు వారి చదువులకు పెద్ద సమస్యగా మారింది. దీనిపై జిల్లా కలెక్టర్ డికె బాలాజీ స్పందించి 22ఎ జాబితాలో నుండి తొలగించాలని దివిసీమ ప్రజలు కోరుతున్నారు. గతంలోనే దీనిపై నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌కు నివేశిన స్థలాలకు సంబంధించిన కొంత మంది అర్జీ సమర్పించారు. అవనిగడ్డ టౌన్‌లో సుమారుగా 12నుండి 15 ఎకరాల విస్తీర్ణంలోని ఇళ్ళ స్థలాలు నిషేదిత భూముల జాబితా లోనికి చేరడంతో క్రయవిక్రయాలు జరగడం లేదు. 299/ఎ 20, 299/18 సి, 2 99/170, 299/13, 299/14, 299/1ఎ వంటి సర్వే నెంబర్లలో ఉన్న స్థలాలు నాలుగు తరాల నుండి రిజిస్ట్రేషన్ అవుతున్న వీటిలో కొన్ని స్థలాలు వారసత్వంగా వచ్చి ఉన్నవి. వీటిని పిల్లల చదువులు, వివాహాలకు వినియోగించుకోవాలంటే నేడు ఇబ్బందులు ఏర్పడ్డాయి. 2016లో ఈ నెంబర్లలోని కొన్ని ఇళ్ళ స్థలాలకు ఋణాలు పొంది గృహాలు నిర్మించుకున్నప్పటికి ఋణం మొత్తం తీర్చగా కొంత మంది రైతులు చెరువులపై ఋణాలు పొంది ఋణాలు చెల్లించినప్పటికి నూతనంగా ఋణానికి వెళితే మీ స్థలం నిషేదిత భూముల జాబితాలో ఉన్నది కావున ఋణం ఇవ్వడం కుదరదు అని బ్యాంక్ అధికారులు చెప్పడంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు అవాక్కు అయ్యారు. వీటితో పాటు కొన్ని పంట భూములకు గతంలోనే ఋణాలు పొంది ఋణాలు చెల్లించినప్పటికి నేడు ఋణాలు పొందే అవకాశం లేకపోవడంతో పాటు గత ప్రభుత్వంలో రైతు భరోసా, పిఎం కిసాన్ వంటి వాటికి అనర్హులుగా గుర్తించారు. వీటిని పరిగణలోనికి తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ బాలాజీలు పునరాలోచన చేసి నిషేదిత భూముల జాబితా నుండి తొలగించాలని దివిసీమ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## న్యాయవాదులు విధులు బహిష్కరణ




**జగ్గయ్యపేట జూలై 29 మేజర్ న్యూస్ :** బెజవాడ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు బెజవాడ బార్ సభ్యులు ఒగ్గు గవాస్కర్ శుక్రవారం ముద్దాయిలు తరుపున మాట్లాడడానికి వెళ్ళగా, మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ లో పాత కేసు 2021 లో యూ /ఎస్ 307 ఐపీసీ కేసుకు సంబందించి,2021 లో జరిగినటువంటి సంఘటన లో పోలీస్ లు అక్రమంగా "ఒగ్గు గవాస్కర్" పేరు ఇంప్లిట్ చేసి కోర్టులో మెమో దాఖలు చేయటం జరిగింది. న్యాయవాదిపై మంగళగిరి పోలీసులు అక్రమ కేసు బనయిం చడాన్ని నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరణ చేసి నిరసన తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు, సెక్రెటరీ దామాల సంతోష్, ట్రెజరర్ మెట్టెల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు బాణావత్ గాంధీ, జగజీవన్ రావ్, మాజీ బార్ అధ్యక్షులు బి వెంకటరామయ్య, సత్య శ్రీనివాసరావు, ఏ కాంతారావు, సీనియర్ న్యాయవాదులు కే నరసింహారావు, జీ లక్ష్మీనారాయణ, జె శ్రీనివాసరావు, బసవరాజు, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, గోపీనాథ్, నరసిం హారెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ, బిక్షమయ్య, బడే జోగేంద్ర కుమార్,, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబాలకు పరామర్శ

**పెడన, మేజర్ న్యూస్ :** ఇటీవల పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను వారి నివాస గృహాలకు వెళ్లి వారిని పరామర్శించడం జరిగిందని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో గల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త యక్కల రాజారావు, పేరిశెట్టి మల్లికార్జున రావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ హన్ను, యర్ర రాజా, గుల్లంకి మాధవ,పరసాజితేంద్ర,కమ్మగంటి బాబు, దాదా, సుబ్రహ్మణ్యం, మెడక కిషోర్ పింజల శ్రీను బల్ల ప్రసాదు ఉన్నారు.

# అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రజల నుండి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. సోమవారం డిఆర్ఓ నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కెఆర్ ఆర్‌సి ఎస్‌డిసి శ్రీదేవి తో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికు "మీకోసం కార్యక్రమం" నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. డిఆర్ఓ అధికారులతో మాట్లాడుతూ చాలా బ్యాంకుల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఖాతాల్లో సరిగా కార్యకలాపాలు జరపక భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారిచే లాక్ చేయబడిందని రెండు రోజుల్లో సంబంధిత శాఖల అధికారులు వాటిని పునరుద్ధరించి తాజా స్థితికి తీసుకొని రావాలని సూచించారు. ఉద్యోగుల గ్రీవెన్స్ రెండో దశలో 33 దరఖాస్తులు రాగా అందులో 21 దరఖాస్తులు పరిష్కరించారని మిగిలిన 12 అర్జీలు కూడా సత్వరమే పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. ప్రజల నుండి వచ్చే అర్జీలను గడువు దాటకుండా నిర్మిత సమయంలో పరిష్కరించాలన్నారు. వచ్చేనెల 15వ తేదీన జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి ప్రసంగం తయారు చేయడానికి ప్రగతి నివేదికలను వచ్చే ఆగస్టు నెల 3వ తేదీ లోగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారికి పంపాలన్నారు. రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఆబ్కారీశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు ఇకపై ప్రతి ఆదివారం మంగినపూడి సముద్రతీరంలో ఉదయం 6 నుంచి 7 గంటలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అవసరమైన వాహనాలను సమకూర్చాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో మొక్కలు విరివిగా నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆనంద కుమార్, ఐసిడిఎస్‌పి డి.సువర్ణ, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీత బాయి, డ్వామా పీడీ సూర్యానారాయణ, డిపిఓ నాగేశ్వర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్ ఈఈలు శ్రీనివాసరావు, శివప్రసాద్, ఎల్డీఎం జయవర్ధన్, సర్వే భూ రికార్డుల ఏడి మనిషా త్రిపాఠి, జిల్లా ఉద్యాన అధికారి జే. జ్యోతి, ఏపీఎంఐపి పిడి విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, డీఈవో తహేరా సుల్తానా తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా కన్వీనర్ గా సంకాబత్తుల వెంకట్

**గన్నవరం, జూలై 29, మేజర్ న్యూస్ :** శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా కన్వీనర్‌గా కృష్ణా జిల్లా గన్నవరం చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ నియమితులయ్యారు. సోమవారం ఆల్ ఇండియా శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా చైర్మన్ ఆంధ్రప్రదేశ రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు చేతులమీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా కన్వీనర్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని ముఖ్యంగా దివ్యాంగ అభివృద్ధికి సంక్షేమానికి, ఉన్నతికి పాటుపడుతున్నామని, సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా కన్వీనర్ గా నియమితులవ్వడం ఎంతో సంతోషాన్ని కలిగిందని మరింత బాధ్యత పెంచిందని ఈ పదవిలో రెండు సంవత్సరాలు ఉంటానని వెంకట్ తెలిపారు. శ్రీకృష్ణదేవరాయల పరిపాలన అంటే మనకు స్వర్ణ యుగం గుర్తుకు వస్తుందని వారి చూపిన మార్గంలో రాయలు వారు ప్రజలకు చేసిన గొప్ప సేవల స్ఫూర్తితో వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆయన అన్నారు. 2005 సంవత్సరంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో యస్.ఎఫ్.ఐ అధ్యక్షులు గా ఉన్నప్పుడు విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చెయ్యడం, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా కన్వీనర్‌గా నియమించిన జాతీయ అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడుకి వెంకట్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని అయిన ప్రతి బిడ్డ ను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు వెంకట్ విజ్ఞప్తి చేసారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్నాటక, తమిళనాడు, వివిధ రాష్ట్రాల్లో ఉన్న తెలగ, కాపు, బలిజ ల అభ్యున్నతికి కృషి చేస్తానని ముఖ్యంగా యువత ఉన్నతికి కృషి చేస్తానని వెంకట్ తెలిపారు. నిరంతరం సేవా స్ఫూర్తితో సామాజిక బాధ్యతతో పలు సేవాకార్యక్రమాలు చేస్తున్న ఆల్ ఇండియా శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా చైర్మన్ ఆంధ్రప్రదేశ రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ చట్ట సభల్లో ఉండాలని వెంకట్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో కాపులు ఏకతాటిపై వచ్చి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మాటపై నమ్మకంతో వారి నాయకత్వాన్ని బలపరిచారని వెంకట్ అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహనరంగా లాంటి కార ణజన్ముడి మరల రారని, స్వయంకృషితో పైకి వచ్చి సినీ చరిత్రలో విజేత గా నిలిచి, ప్రజలు కష్టాలలో ఉంటే నేను ఉన్నానని అండగా నిలిచిన మెగాస్టార్ చిరంజీవి లాంటి గొప్ప వ్యక్తులు భారతదేశ చరిత్రలో లేరని తెలిపారు. మనకు స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాల దాటిన 80 శాతం కాపులు ఈ రోజుకి కూడా పేద వర్గాలుగా మిగిలారని వెంకట్ ఆవేదన చేసారు. ఈ సమాజానికి రక్షణగా కాపు కాసే జాతి కాపులని ఎట్టి పరిస్థితుల్లోనూ హాని తలపెట్టిన వ్యక్తులని,



నమ్మితే ప్రాణాలు సైతం ఇస్తారని వెంకట్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతి మార్గంలో నడుపుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి వెంకట్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమిలో గెలుపొం దిన కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, శాసనసభ్యలకు, పార్లమెంట్ సభ్యులకు వెంకట్ శుభాకాంక్షలు తెలిపారు. ఆల్ ఇండియా శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా చైర్మన్ ఆంధ్రప్రదేశ రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ లాంటి వ్యక్తులు సేవలు ప్రస్తుత సమాజానికి అత్యంత అవసరమని, స్పందన మానసిక వికాస కేంద్రం ఏర్పాటు చేసి ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాలు వంటి సేవలు చెయ్యడం మామూలు విషయం కాదని, కరోనా క్లిష్టమైన పరిస్థితులలో సామాజిక బాధ్యతగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రాణాలను సైతం లెక్క చెయ్యకుండా 20,000 మందిపైగా వలస కూలీలకు బాటసారులకు, యాచకులకు, పారిశుధ్య కార్మికులకు, దివ్యాంగులకు, వృద్దులకు, వితంతువులకు, పేదలకు నిరంతరం భోజనాలు, నిత్యావసర వస్తువులు, మందులు ఇవ్వడం అంత సామాన్య విషయం కాదని, అప్పటి కృష్ణా జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ వెంకట్ సేవలు గుర్తించి కోవిడ్ –19 మెంబర్ గా నియమించడం జరిగిందని ఆయన అన్నారు. వెంకట్ చేస్తున్న సేవాకార్యక్రమాలకు తోడుగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని నాయుడు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుండి నాయకత్వ లక్షణాలు,సేవా దృక్పథం ఉందిని, అదే స్ఫూర్తి తో పలు సేవాకార్యక్రమాలు చేస్తున్న వెంకట్ ను నేషనల్ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు అభినందించారు. శ్రీకృష్ణదేవరాయల సంఘ ఆల్ ఇండియా కన్వీనర్ నియమితులయిన సంకాబత్తుల వెంకట్ ను, మచిలీపట్నం గౌరవ పార్లమెంట్ నియోజకవర్గం యం.పీ వల్లభనేని బాలశౌరి గన్నవరం నియోజకవర్గం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకటరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వంకయాలపాటి వెంకటేశర్లు, ప్రొఫెసర్ వి.అనూరాధ, గన్నవరం మండల వైస్ యం.పీ.పీ కొమ్మా సుధీర్, టీడీపీ సీనియర్ నాయకులు గూడపాటి తులసి మోహన్, గన్నవరం మార్కెట్ యాడ్ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, గన్నవరం మాజీ యం.పీ.పీ పొట్లూరి బాసవరావు, ఆంధ్రప్రదేశ్ మండల విద్యాశాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట రత్నం అదూరి, డి.పిఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను, వి.కె.ఆర్ కాలేజీ విశ్రాంతి ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణకుమారి, ప్రముఖ ఆర్ధిక నిపుణులు గన్నే వెంకటరావు, స్రవంతి హైస్కూల్ అధినేత కొమ్మినేని రామకృష్ణ, ప్రసాదంపాడు మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనంద్ కుమార్ జనసేన పార్టీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్, గన్నవరం నియోజకవర్గం జనసేన నాయకులు గరికపాటి శివశంకర్, గన్నవరం నియోజకవర్గం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దామెర సీతారామయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్, ఉత్తరాంధ్ర దివ్యాంగుల హక్కుల సాధన పరిరక్షణ సమితి అధ్యక్షులు సంకాబత్తుల హరినాధ్ స్పందన మానసిక వికాస కేంద్రం ప్రిన్సిపాల్ డి.విజయలక్ష్మి, వీనస్ బుక్ సెంటర్ అధినేత మోటమర్రి శేఖర్, ఆర్నేపల్లి సింహాచలం,గ న్నవరం నియోజకవర్గం కాపు యూత్ అధ్యక్షులు గొంతెన రాజ్ కుమార్, నూజివీడు నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు, ఎ.యమ్.సి డైరెక్టర్, తెలుగునాడు ఉపాధ్యాయ యూనియన్ కృష్ణా జిల్లా అధ్యక్షులు పర్వతనేని వాసు, వీరబత్తిన జోషి, డి.పిర్ టి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు మరిదు నాగేంద్ర కుమార్, గన్నవరం మండలం డి.పి.ఆర్.టి యు అధ్యక్షులు డి.ఆర్.యస్ నాయక్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైస్ చైర్మన్ జయబాబు, ఐకాన్ ఎడ్యుకేషన్ అకాడమీ డైరెక్టర్ తెలుగుదేశం నాయకులు వీరబత్తిన అమల్ దాస్, టి.డి.పి నాయకులు వేమూరి వేణు, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఇ.సి మెంబర్ కాటం చిట్టి రవిబాబు, డాక్టర్ పసుపులేటి రామప్రసాద్, డాక్టర్ పసుపులేటి సుధాకర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల జె.ఎ.సి రాష్ట్ర చైర్మన్ కాశి, ప్రత్యేక ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు నాని, గన్నవరం జనసేన మండల అధ్యక్షులు పచ్చిపాల లక్ష్మణరావు, శ్రీ రాఘవేంద్ర స్వీట్ హోమ్ అధినేత బండి అప్పారావు, శ్రీప్రజ్ఞ హైస్కూల్ అధినేత సూరి పవన్ కుమార్, వెంకట మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్తంశెట్టి దుర్గా కిషోర్, జనరల్ సెక్రటరీ కొలవెన్ను నాని, ఉంగుటూరు జనసేన నాయకులు సి.హెచ్.రాజేష్ లు ఆంధ్రప్రదేశ్ చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఈశ్వర్ అకాడమి విద్యార్థులు ఎంపిక



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఈశ్వర్ అకాడమి విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈ నెల 28 వ తేదిన విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించగా దివిసీమకు చెందిన ఈశ్వర్ అకాడమి విద్యార్థులు ఎంపిక అయినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి అండర్ 11, అండర్ 14 విభాగాలలో సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొనగా, ఈశ్వర్ డ్యాన్ అండ్ మార్షల్ ఆట్స్ అకాడమి నుండి పలు కేటగిరిలలో పాల్గొన్న విద్యార్థులలో వి శ్రావణి, సిహెచ్ సాత్విక, కె ఖజియ, కె తేజేష్, ఎం ఫణిగిరిధర్, చరణ్ సాయి మణికంతలు బంగారు పతకాలు సాధించగా వి నాగ సాయి కార్తీక్, కె జాహ్నవి, మణిదీప్ కుమార్‌లు రజిత పతకాలు, ఎస్ నాగ ప్రత్యూష, బి శ్రీ కౌషిక్, వి సాయి చాణక్య, సిహెచ్ చతురిష్ కాంస్య పతకాలు సాధించారన్నారు. జిల్లా కోసాధికారి అయిన మాస్టర్ ఈశ్వర్ 5 ద డిగ్రి బ్లాక్ బెల్ట్ అకాడమీ అధ్యక్షురాలు పి విశ్వలు పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్‌లు కె.వి సుబ్బు, రవి నాగ అరవింద్, జాహ్నవి లను అభినందిచారు. బంగారు పతకాలు సాధించిన వారు ఆగష్టు 3,4 తేదిలలో అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని మంచి ప్రతిభను కనపరచాలని కోరారు.



## డంపింగ్ యార్డ్ సమస్య తీర్చాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ అవనిగడ్డలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం అవనిగడ్డ రెవెన్యూ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషు బాబు, బందలాయి జనసేన పార్టీ గ్రామ కన్వినర్ కమ్మిలి మారి బాబులు కలెక్టర్‌ను కలిసి అవనిగడ్డ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. అవనిగడ్డలో ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యను త్వరగా పరిష్కరిస్తే దీని వల్ల అవనిగడ్డలోని కొన్ని సమస్యలు పరిష్కరింపబడతాయని గుడివాక కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి మోక్షానందం( బుజ్జి) తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో జిల్లా కలెక్టర్ డికె బాలాజీ మధ్యాహ్నం డొక్కా సీతమ్మ బడి భోజనాన్ని సహబంతిలో కూర్చొని రుచి చూసి ఆనందం వ్యక్తపరిచారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడ భోజనం మెనూ ని తప్పక ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఇ.ఒ ఎన్ శివశంకరరావు, ఎం.ఇ.ఒ 2 అన్నపరెడ్డి పిచ్చయ్య, ప్రధాన ఉపాధ్యాయులు గోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## బొమ్మిరెడ్డి కోటేశ్వరమ్మకు మంత్రి కొల్లు రవీంద్ర ఘన నివాళి

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మారెడ్డి హోచి మిన్ మాతృమూర్తి బొమ్మారెడ్డి కోటేశ్వరమ్మకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఘన నివాళి అర్పించారు. అజిత్ సింగ్‌నగర్లోని శాదీఖానాలో నిర్వహించిన కోటేశ్వరమ్మ సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

## అక్షరం నేర్పే తొలిబడి అంగన్వాడీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**కంచికచర్ల జూలై 29 మేజర్ న్యూస్ :** చిన్నార్లుకు అక్షరాలు నేర్పే తొలిబడి అంగన్వాడీ కేంద్రం అని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు మండల కార్యాలయ ఆవరణలో గల అంగన్వాడి కేంద్రాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు ఆహారాన్ని అందించాలన్నారు. అలాగే బాలింతాలకు, గర్భిణులకు పౌష్టికాహారం, వైద్య సౌకర్యాలు అందజేయాలని తెలిపారు తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు.

## బీసీ భవనాలు నిర్మించాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేం దుకు 2018 నాటి తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిన బిసి భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బిసి నేత, తెలుగు దేశం పార్టీ కృష్ణాజిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మత్స్య భవనంలో విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలోని 6 మండలాల్లో 6 బిసి భవనాలను అప్పటి శాసనసభ ఉపసభాపతి, ప్రస్తుత శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మంజూరు చేయించారని, గ్రామ స్థాయి భవనానికి 10 లక్షలు, మండల స్థాయి భవనానికి 25 లక్షలు నిధులు కేటాయించగా, 2019లో ఏర్పడిన వైసిపి ప్రభుత్వంలో నిర్లక్ష్యం కారణంగా ఈ భవనాలు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. బిసి భవనాల నిర్మాణానికి తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని లకనం విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ముగిసిన శిక్షా సప్తాహ్



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** పులిగడ్డ గురుకుల పాఠశాలలో విద్యావారోత్సవాలు (శిక్షా సప్తాహ్) ప్రశాంతంగా ముగిశాయి. ప్రధానోపాధ్యాయులు ఎస్.టి.పి కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు వీర కుమా ర్లు విద్యార్థులతో గత వారం రోజులుగా సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. తెలుగు సాంప్రదాయ ఆటలు అయినటువంటి గ్రామీణ సాం ప్రదాయ ఆటలను విద్యార్థుల చేత ఆడించి ప్రతిభ కనబర చిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ప్రతిరోజు విద్యార్థులతో సాంప్రదాయ ఆటలు నిర్వహించి పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో మొక్కలు నాటించి మొక్కలు పెంచే భాధ్యత ప్రతి ఒక్క విద్యార్థి తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో మొక్క నాటుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించి ముగింపు సందర్భంగా శుభ్‌దిన్ భోజన కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి విద్యార్థుల తల్లిందండ్రులు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాస్, కె సురేష్, డి శ్రీనివాస్, పి హేమంత్ బాబు, డిఎన్‌వి ప్రసాద్, జగన్, విజయ్ కుమార్ లతో పాటు పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజకుమారి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం ఉదయం మండలి బుద్ధప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఆవుల బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారిని మండలి బుద్ధప్రసాద్– విజయలక్ష్మీ దంపతులు, యువనాయకులు మండలి వెంకట్రామ్– సాయిసుప్రియ దంపతులు, కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేదపండితులు వేదాశీర్వచనం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రం పురోగతి సాధించాలని, పాడిపంటలతో, పరిశ్రమలతో అన్ని రంగాల ప్రజలు సువిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు.

# 'పొగాకు దుష్ప్రభావాలు వివరిస్తూ హెచ్సీజీ హెల్త్ క్యాంపైన్





**విజయవాడ మేజర్ న్యూస్ :** పొగాకు వినియోగం వల్ల కలిగే విషపూరిత ప్రభావాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడానికి 'హావ్ మోర్ టీ, నో మోర్ పఫ్స్' అనే పేరుతో ఒక ఆసక్తికరమైన ఇంటరాక్టివ్ హెల్త్ క్యాంపెయిన్‌ను విజయవాడలోని లోని హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ నిర్వహించింది. టీ స్టాల్స్‌లో టీ సిగరెట్‌లు తాగడానికి గుమిగూడే వినియోగదారులకు 'హావ్ మోర్ టీ, నో మోర్ పఫ్స్' అనే ఆకర్షణీయమైన నినాదంతో టీకప్పులను విజయవాడ హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ ప్రతినిధులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని హెచ్‌సిజి సిటీ క్యాన్సర్ సెంటర్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సత్య శ్రీనివాస్ ఎ, హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, రీజినల్ బిజినెస్ హెడ్ ఏపీ, ఈస్ట్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలితో టీని అనుబంధించేటప్పుడు పొగాకు యొక్క హానికరమైన ప్రభావాలను ప్రజలకు గుర్తు చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నగరవాసులపై శాశ్వత ముద్రను సృష్టించడం, వారి అలవాట్లను పునఃపరిశీలించుకోమని ప్రోత్సహించడం, వారి శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం, చివరికి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రచారానికి విశేషమైన రీతిలో సానుకూల స్పందన లభించిందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలనే మా నిబద్ధతలో భాగంగా విజయవాడ హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ , 'హావ్ మోర్ టీ, నో మోర్ పఫ్స్' ప్రచారాన్ని ప్రారంభించిందన్నారు. స్థానిక టీ స్టాల్స్‌లో ఆకర్షణీయమైన నినాదంతో కూడిన టీ కప్‌లను పంపిణీ చేయడం ద్వారా, పొగాకు యొక్క హానికరమైన ప్రభావాలను మన కమ్యూనిటీకి గుర్తుచేయాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అదే సమయంలో సిగరెట్ లేకుండా టీని ఆస్వాదించమని వారిని ప్రోత్సహించాము అని అన్నారు.

# మృతుల కుటుంబాలకి నష్ట పరిహారం వెంటనే అందించాలి




### అల్ట్రా టెక్, రాంకో సిమెంటు కంపెనీలలో ప్రమాద ఘటనలలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్

**జగ్గయ్యపేట జూలై 29 మేజర్ న్యూస్ :** పట్టణంలో మండల తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో అల్ట్రా టెక్ సిమెంటు కంపెనీలో ప్రమాదం జరిగి 16 మంది క్షతగాత్రులయ్యారు.వారిలో ఇప్పటికే 4 గురు మరణించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ చొరవతో కంపెనీ నుండి 50 లక్షలు నష్ట పరిహారం మృతుల కుంటుంబాలకు అందించడం జరిగింది. ఇదే మండలంలో రాంకో కంపెనీలో ప్రమాదం జరిగి మూఢవతు నాగులు మరణించగా వారి కుటుంబానికి సరైన న్యాయం జరగలేదు. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావడం జరిగింది.

రాంకో కంపెనీలో మృతి చెందిన మూఢవతు నాగులు కుటుంబానికి కూడా రాంకో సిమెంట్ కంపెనీ యాజమాన్యం 50 లక్షల రూపాయలు, ప్రభుత్వం నుండి 50 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ పార్టీ కోరుతున్నాము. పారిశ్రామిక, కాలుష్యం నియంత్రణ అధికారుల పర్యవేక్షణ లోపం వలన కార్మికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా ఆరోగ్యం మెరుగు పరచాల్సిన బాధ్యత అధికారులపై వున్నది. వెంటనే ప్రభుత్వం నుంచి 50లక్షల రూపాయలు నష్టపరిహారం బాధిత కుటుంబాలకు అందచేయాలని అవసరమైతే అన్ని రాజకీయ,కార్మిక పక్షాలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నాము.

అనంతరం మండల తహశీల్దార్ వారికి వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐవైయఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేం ద్రబాబు, ఏఐవైయఫ్ జిల్లా నాయకులు లంకా గోవింద రాజులు,కరిసే మధు, సిపిఐ సీనియర్ నాయకులు బుట్టి రాయప్ప,సిపిఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ,పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు షేక్ మహ్మద్ అసదుల్లా,మాశెట్టి రమేష్,మెటికల శ్రీనివాస రావు, షేక్ జాని, బూదవాడ గ్రామస్తులు గుగులోతు బాలాజీ నాయక్, మూడావత్తు కృష్ణుడు, మూడావత్తు మోహన్, గంగుల బ్రహ్మం, గుగులోతు శంకర్, ఏఐటియుసి నాయకులు ఈమని సత్యనారాయణ, మస్తాన్,వెంకట నారాయణ, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవోకు వెలుగు మిత్రుల వినతిపత్రం



**నందిగామ, జులై 29, మేజర్ న్యూస్:**అకారణంగా తొలగించిన వెలుగు మిత్రలను విదులలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆద్వర్యంలో సోమవారం నందిగామ ఆర్ డి ఓ కార్యాలయం వద్ద విఓలు నిరసన తెలిపారు. నందిగామ ఆర్ డి ఓ రవీంద్ర రావు కు వెలుగు మిత్రలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గం లో కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలం లో సుమారు వంద మంది వెలుగు మిత్రలు పని చేస్తున్నారని, వీరిని అధికార పార్టీ నాయకులు రాజకీయ వేధింపులకు గురి చేస్తూ అకారణంగా విదుల నుండి తొలగించటం హేయమైన చర్య అన్నారు. వెలుగు మిత్రలు ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం సంక్షేమ పథకాలను డ్వాక్రా సభ్యులకు చేరవేస్తున్నారని, గత పది హేను సంవత్సరాలు గా ఎటువంటి జీత భత్యాలు తీసుకోకుండా డ్వాక్రా సభ్యులను చైతన్యం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారిన పార్టీలకు సంబంధం లేకుండా విఓఎ లు పని చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన తరువాత పని చేస్తున్న వెలుగు మిత్రలు తీసి వేసి కొత్త సభ్యులను విఓఎలను తీసుకుంటున్నారని తెలిపారు. పని చేస్తున్న వెలుగు మిత్రలకు నాలుగు నెలలు నుండి జీతాలు లేక పోయిన కొత్త వారిని నియమించడం హేయమైన చర్య అన్నారు. ప్రస్తుతం జీతాలు వచ్చే సమయంలో కొత్త వారిని అపాయింట్ మెంట్ అధికారపార్టీ నాయకులు చెప్పటం విడ్డూరంగా వుందన్నారు. విదుల నుండి తొలగించని వివిఓలను తక్షణమే విదులలోకి తీసుకోవాలని, లేని పక్షంలో సిఐటియు ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆర్ డి ఓ రవీంద్ర రావు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వెలుగు మిత్రలు శ్రీ లక్ష్మీ, చంద్రకళ, షేక్ దిల్ షా, టి. లక్ష్మీ, కుమారి, మల్లేశ్వరి, సుమలత, వెంకటరావమ్మ, స్వరూప, ప్రశాంతి, జమలమ్మ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డిగూడెం మండలానికి రూ.5 కోట్లు మంజూరు

## మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్:** మండలంలో మౌలిక వసతుల కల్పనకు రూ.5 కోట్ల ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయని వీటిని ప్రాధాన్యత క్రమంలో ఆయా సమస్యల పరిష్కారానికి కేటాయిస్తామని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కొత్త రెడ్డిగూడెం గ్రామంలో సోమవారం స్థానిక ఎన్డీఏ నాయకులు, అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ముందుగా దివంగత నేత ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి ఏపీ మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అధికారుల బదిలీలు పూర్తయిన తర్వాత మౌలిక వసతుల కల్పనకు పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తున్న నిధులను జనసాంద్రత, సమస్య తీవ్రతను బట్టి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కక్షలు, కార్పణ్యాలు విడనాడి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని పిలుపునిచ్చారు. పదవులు అశాశ్వతమని, ప్రజలకు మనం చేసే మంచే చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పిన విధంగా ప్రజలకు మంచి చేద్దామని తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్షిద్దాం, తప్ప చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని కోరారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా తను ఎటువంటి కక్షలకు పాల్పడలేదు కాబట్టే 42 వేల పైచిలుకు ఓట్ల భారీ మెజార్టీతో తనను ప్రజలు గెలిపించారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ని అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. కానీ మన ఎన్డీఏ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు సంబంధించి విశ్రాంత హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరరావుని మైలవరంలోని కార్యాలయం ప్రతినిధిగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక నాయకులు ఏ సమస్యలున్నా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 3వ జోన్ పరిధిలో సాగర్ జలాల విడుదలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జలాశయాలు పూర్తిగా నిండినా సరే విభజించబడిన ఆంధ్రప్రదేశ్లో దిగువకు సాగర్ జలాలను పూర్తిగా విడుదల చేయటం లేదని, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కందులపాడు నుంచి నాగులూరు వరకు విస్తరణతో కూడిన రహదారి అభివృద్ధికి రూ.42 కోట్ల నిధులు మంజూరు చేయించానని అది టెండర్, అగ్రిమెంట్ కూడా పూర్తయిందన్నారు. కానీ గతంలో బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదన్నారు. ఇప్పుడు తాజాగా నాగులూరు నుంచి మద్దులపర్వ వరకు కూడా బీటీ రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రహదారి అభివృద్ధి పూర్తి స్థాయిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. రోడ్ల నిర్వహణకు, మరమ్మత్తులకు కూడా తగు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఏపీలో 2019 వరకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి రూ.8,000 కోట్లు కేటాయిస్తే, గత వైసిపి ప్రభుత్వం కేవలం రూ.1300 కోట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు. కానీ మన ఎన్డీఏ ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే మంజూరు చేస్తే తాజాగా ఎన్డీఏ ప్రభుత్వం రూ.4 లక్షల రూపాయలు వరకు కేటాయిస్తూ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు. దీనివల్ల పేదలు సొంతింటి కల నెరవేర్చుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. దీనిపై తను గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తో మాట్లాడానని విధివిధానాలు ఖరారు అయ్యాక మన నియోజకవర్గంలో గృహ నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక దీర్ఘకాలిక సమస్యలైన వంతెనల నిర్మాణం, తదితర సమస్యల పరిష్కారానికి డిఎంఎఫ్, జిల్లా పరిషత్, ఎంపీ ల్యాడ్స్ ఇతరత్రా నిధులను మంజూరు చేయించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా సమస్యలను గుర్తించాలని స్థానిక నాయకులకు సూచించారు. అందరూ కలిసి ఐకమత్యంగా పనిచేసి ప్రజలకు విస్తృతంగా సేవలను అందించాలని కోరారు. త్వరలో గ్రామాల వారీగా పర్యటించి నేరుగా సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు కే విజయబాబు, మండల టిడిపి అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వర రెడ్డి, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, పాలంకి మోహన మురళి రెడ్డి, రామినేని బుజ్జి, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చాపలమడుగు కాంతారావు, మండల బిజెపి అధ్యక్షుడు గోపి స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ టోల్ వసూలు చేస్తున్న టోల్గేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



**నందిగామ, జూలై 29, మేజర్ న్యూస్:** అక్రమ టోల్ వసూలు చేస్తున్న టోల్గేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలనీ అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మన్నె హనుమంతు రావు కోరారు. టోల్ గేట్ ల అక్రమాలపై చర్యలు కోరుతూ సోమవారం నందిగామ ఆర్డీవో రవీంద్ర బాబుకి నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ గైడ్లైన్స్ ప్రకారం 60 కిలోమీటర్ల వ్యవధిలో నివాసం ఉంటున్నటువంటి ప్రజలకు టోల్ వసూలు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ నందిగామ మండలం కిసర, చిల్లకల్లు మండలం గట్టు భీమవరం వద్ద ఉన్న టోల్ ప్లాజాలు అక్రమంగా టోల్ వసూలు చేస్తున్నాయని, కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రివర్యులు నితిన్ ఘట్కరే 60 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రజల వద్ద నుండి టోల్ వసూలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని 60 కిలోమీటర్ల వ్యవధిలో రెండు టోల్ గేట్లు ఉండడం కూడా సరికాదని ప్రకటించినా జాతీయ రహదారి అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. నందిగామ చిల్లకల్లు టోల్గేట్ల మధ్య కేవలం 28 కిలోమీటర్ల వ్యత్యాసం ఉంటే టోల్గేట్లు నిర్వహించడం సరైనటువంటిది కాదని విమర్శించారు. తక్షణమే తమరు చొరవ తీసుకొని గట్టు భీమవరం కీసర టోల్గేట్లలో ఏదో ఒక టోల్గేట్ను మాత్రమే ఏర్పాటు చేసే విధంగా ప్రజల నుండి అక్రమ వసూళ్లు చేస్తున్న టోల్గేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య గా కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు రవి,రామ్ లాల్ బుజ్జి అమర్ నాగరాజు, వాహన యజమానులు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వ రైతు వ్యతిరేక బడ్జెట్ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు



**నందిగామ, జులై 29, మేజర్ న్యూస్ :** సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు నందిగామ గాంధీ సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, జిల్లా కార్యదర్శి కే గోపాల్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్ వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువులపైన, ఆహారం, ఇంధన సబ్సిడీలలో భారీగా కోత విధించారు. ఉ:2022-23లో ఎరువుల సబ్సిడీకి 2,51,339 కేటాయించగా, 2023- 24 సంవత్సరానికి రూ1,88,894 కోట్ల రూ తగ్గించి 2024-25 సం:కి 1,64,000 కోట్లకు దారుణంగా కుదించారు. అనగా 2022-23 బడ్జెట్లో పోల్చిచూస్తే 87,339 కోట్లు భారీ కోత(35%)పెట్టారు... అలాగే ఆహార సబ్సిడీ కూడా దారుణంగా తగ్గించారు. 2022-23 బడ్జెట్ లో ఆహార సబ్సిడీకి 2,72,802 కోట్లు కేటాయించగా 2023-24లో 2,12,332 కోట్లు రూ తగ్గించి, తిరిగి 2024-25 సంవత్సరానికి రూ 2,05, 250 కోట్లకు కుదించారు. అనగా 2022-23లో పోలిస్తే 67,552కోట్లు (25%)శాతం కోత విధించాన్నమాట. అలాగే ఇంధన సబ్సిడీని 12,240 కోట్ల నుండి రూ 11,965 కోట్లకు(7,87%)తగ్గించారు... అంతేగాక ఉపాధి హామీ చట్టానికి కూడా అదేగతి పట్టించారు. 2022-23 సంవత్సరానికి రూ 101,000 కోట్లు, కేటాయించగ ఇప్పుడు రూ (20%) తగ్గించి 80,000 కోట్లు మాత్రమే కేటాయించారు. దీనిలో నుండి గత సంవత్సరం బకాయి సుమారు రూ 20,000కోట్లు తీసేస్తే ఇక మిగిలేది రూ 60,000 కోట్లు మాత్రమే అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి రూపాయి పెంచలేదు. గతేడాది రూ 16000 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం యధాతథంగా ఉన్నది. పంటల బీమా పథకానికి గత బడ్జెట్లో రూ 15,000 కోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం రూ 400 కోట్లు తగ్గించి రూ 14,600 కోట్లు మాత్రమే కేటాయించారు... మద్దతు ధరల ఊసేలేదు. దేశవ్యాపితంగా దళిత,బలహీన వర్గాల ప్రజలు కోట్లాదిమంది వ్యవసాయ రంగంమీద ఆధారపడ్డారు. వారికి రక్షణ లేదు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామన్నారు. కానీ దాని ఊసే లేదు అన్నారు. ఇప్పటికైనా ఆలోచించి ఈ బడ్జెట్ జరిగే సెషన్ లో సవరించి 150 కోట్ల ప్రజానీకానికి అన్నం పెట్టే వ్యవసాయ రంగానికి, ఐదు లక్షల కోట్లు,ఆహార భద్రత 30 లక్షల కోట్లు, ఉపాధిహామీ పథకానికి రెండు లక్షల కోట్లు, కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాము. లేనియెడల రాబోవు కాలంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సయ్యద్ కాసిం, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, బి లాజరు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏక్తవా పబ్లిక్ స్కూల్ ఇన్వెస్టిటూర్ వేడుకలు



**కంచికచర్ల, జులై 29, మేజర్ న్యూస్ :** పట్టణంలోని జుజ్జూరు రోడ్డులో ఏక్తవా పబ్లిక్ స్కూల్ ఇన్వెస్టిటూర్ వేడుకలో స్థానిక ఎన్డీయే కూటమి నేతలతో కలిసి శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల్లలో ప్రమాణాలు విద్యార్థుల్లో పరిణతిని పెంచే విధంగా ఎన్డీయే ప్రభుత్వం ఉంటుంది అని మంత్రి నారా లోకేష్ గత ప్రభుత్వంలో విద్య శాఖలో జరిగిన అవకతవకలు, తప్పులను అన్నింటిని ప్రక్షాళన చేసి మెరుగైన విలువలతో కూడిన సంస్కరణలు తీసుకొచ్చే దిశగా అయన పని చేస్తున్నారని తెలియజేస్తూ ఏక్తవా పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు అమరనేని రమేష్, మనోజ్, కార్తీక్, విద్యా సంస్థల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## చర్మ కార్మికుడుకి చేయూతనిచ్చిన వత్సవాయి ఎస్ఐ





**వత్సవాయి జూలై 29 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో గ్రామానికి చెందిన ఉప్పర కృష్ణ వయసు 61 సంవత్సరాలు వత్సవాయి గ్రామస్తుడికి తన ఉపాధిలో భాగంగా చెప్పులు కుడుతూ జీవనం సాగించే వ్యక్తి కి ఆసరా నిలిచిన వత్సవాయి ఎస్ ఐ అభిమన్యు. తరచుగా వర్షానికి చర్మ కార్మికుడు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వత్సవాయి పోలీస్ వారు మానవతా దృక్పథంతో స్పందించి వాననీరుతో ఇబ్బంది పడకుండా వారికి చిన్న షాపు వంటిది ఏర్పాటు చేయడం జరిగినదని స్థానిక ఎస్ఐ తెలిపారు. పేదవానికి సహాయపడటంలో ఎంతో సంతృప్తి మిగులుతుందని నేను కూడా లేని స్థితి నుండి ఈ స్థాయికి వచ్చానని ఎదుటివారి బాధలు చూస్తే నా మనసు చలిస్తుందని ఆయన ఆవేదన తెలిపారు. చర్మ కార్మికుడు పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగర అందాన్ని, ప్రజారోగ్యాన్ని పెంచేందుకు మొక్కలను మరింత పెంచండి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, పిసిఆర్ ఫ్లైఓవర్, ఎంజీ రోడ్ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ప్రకాశం బ్యారేజ్ దగ్గర నుండి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం, పిసిఆర్ ఫ్లైఓవర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, నగరాన్ని మరింత అందంగా ఆహ్లాదంగా మార్చేందుకు మొక్కలను నాటుత, వాల్ పెయింటింగ్లను పెంచమన్నారు.

ట్రాఫిక్ అంతరాయం కలిగించే బ్యానర్లను వెంటనే తీసివేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కనక దుర్గ ఫ్లైఓవర్ వాల్ పెయింటింగ్స్ వేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద ప్రజలకు పబ్లిక్ టాయిలెట్స్ని నిర్మించుటకు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నగరంలో, డివైడర్లపై మొక్కలని మరింత పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్ కి ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర తో పాటు అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ మహేష్, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, జోనల్ కమిషనర్ వన్ రమ్య కీర్తన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 1 ఏ ఎస్ ఎన్ ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ చీరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 2 శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





# టీటీడీ కళ్యాణమండపం పునః ప్రారంభించాలి



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థలో ఆరోగ్య శాఖాధికారి నియామకం, టి.టి.డి కళ్యాణమండపం పునః ప్రారంభం, సర్వజన ఆస్పత్రిలో వివిధ సమస్యల పరిష్కారం కోసం డి.ఆర్.ఓ చంద్రశేఖర్కు కృష్ణా జిల్లా బీ.సీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం సోమవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం సుబ్రమణ్యం మాట్లాడుతూ నగరపాలక సంస్థలో గత కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్యశాఖ అధికారి లేకపోవడంతో పర్యవేక్షణ లేమిని ఆసరాగా చేసుకుని మాంసం వ్యాపారులు నాణ్యతలేని మాంసాన్ని విక్రయించడం జరుగుతొందన్నారు. దీనివలన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో సేవలు నిలిపివేయడంతో పేద,మధ్య తరగతి వారు ఫంక్షన్లు జరుపుకొనుటకు, శ్రీవారి సర్వదర్శనం టికెట్ల కొరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. కాబట్టి టీటీడీ కళ్యాణ మండపాన్ని పునః ప్రారంభించి పేదలకు సేవలు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వజన ఆస్పత్రిలో మూలకి చేరిన ఎండోస్కోపీ పరికరాన్ని అందుబాటులోకి తేవాలని, మరో మహాప్రస్థానం వాహనాన్ని అందుబాటులోకి తెచ్చి, ప్రైవేట్ అంబులెన్స్ వారి దోపిడీని అరికట్టి పేద రోగులను ఆదుకోవాలని సుబ్రమణ్యం డి.ఆర్.ఓ చంద్రశేఖర్ ను కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బీసీ నాయకులు నిక్కు రాధాకృష్ణ, బొబ్బు పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరగాలి





**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** ఆగస్టు ఒకటవ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కొన్ని మండలాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు అలసత్వం ప్రదర్శించారని, ఈ సారి అలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా చేపట్టాలని ఆదేశించారు. పంపిణీకి ముందు రోజు గ్రామం లేదా పట్టణంలోనే తప్పనిసరిగా ఉండాలని, వారి పరిధిలోని లబ్ధిదారుల జాబితా ప్రకారం రూట్ మ్యాప్ను రూపొందించుకొని ప్రణాళిక బద్ధంగా పంపిణీ చేపట్టాలన్నారు. పంపిణీ కార్యక్రమం ఉదయం నుంచే ప్రారంభించడం ద్వారా సర్వర్ పై ఒత్తిడి ఉండదని, యాప్ లో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. గన్నవరం మండలంలోని కొత్తగూడెం సచివాలయానికి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ ఉద్యోగి అయిన కే పావని ఎనిమిది నెలల గర్భిణీ అయినప్పటికీ ఉదయం నాలుగు గంటల నుంచే పింఛన్లను పంపిణీ చేసి 99 శాతం పూర్తి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిందని, పావనితో పాటు ఎంపీడీవో సత్య కుమార్ ను కలెక్టర్ అభినందించారు. ఆ అంకితభావం ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, డిఆర్డిఏ ఇంచార్జ్ పిడి నాగేశ్వర నాయక్, మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మండలాల ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువతి యువకులకు

# జాబ్ మేళా..

**జిల్లా కలెక్టర్ డా. జి. సృజన**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** గిరిజన యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్ మేళాలను నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన ఒక ప్రకటనలో కోరారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్లో ఉత్తీర్ణులై ఇంగ్లీష్ భాష చదవడం, వ్రాయడంలో నైపుణ్యంగల గిరిజన యువతీ యువకుల కొరకు సికింద్రాబాద్కు చెందిన ఎస్కె సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెంట్ కెఎల్ గ్రూప్ వారి సౌజన్యంతో జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. జూలై 31వ తేదీన విజయవాడ సమీపంలోని గొల్లపూడిలోగల జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్డిఏ) కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో అర్హత కలిగిన గిరిజన యువతకు పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్,అన్లోడింగ్ వంటి ఉద్యోగాలలో అవకాశం కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. వారానికి ఐదు రోజులు షిఫ్టులు వారిగా పనిచేయవలసి ఉంటుందని నెలకు 17000 రూపాయల జీతం, పిఎఫ్, ఈఎస్ఐ, మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్య తో పాటు అదనపు పనికి కూడా వేతనం కల్పిచడం జరుగుతుందన్నారు. పైన తెలిపిన ఉద్యోగాలకు ఆసక్తిగల గిరిజన యువత బయోడేటాతో పాటు 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఆదార్కార్డు, రేషన్ కార్డు, పాస్పోర్టు సైజ్ ఫోటోతో 31వ తేదీ ఉదయం 10 గంటలకు డిఆర్డిఏ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. జాబ్ మేళా కార్యక్రమాన్ని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి జె. సునీత పర్యవేక్షిస్తారని ఇతర వివరాలకు 7893751698లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన ప్రకటనలో తెలిపారు.

## ప్రజా పంపిణీ చౌక బియ్యం పక్కదారి

**రేషన్ షాప్ పై దాడులు**



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో పేదలకు చేరవలసిన రేషన్ బియ్యం పక్క దారి పడుతున్నాయి ఫిర్యాదులతో రెవిన్యూ, సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం సిరివెళ్లపాలెంలో పేరు బోయిన నాగలక్ష్మి షాప్ నెంబర్ 48లో అధికారులు తనిఖీలు నిర్వహించి స్టాక్ లో వ్యత్యాసాన్ని కనుగొన్నారు. 32 బియ్యం బస్తాలు తగ్గడాన్ని గమనించారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా రేషన్ షాపును స్థానిక పంచాయతీ కార్యాల యంలో నిర్వహిస్తున్నట్లు కనుగొన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఎటువంటి అనుమతులు లేకుండా ఈ షాపు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది వీరి మీద 6ఎ కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల సుభాని తెలియజేశారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999